క్లుప్తంగా

నేడు పామాయిల్ రైతుల రాష్ట్ర సదస్సు



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: పామాయిల్ రైతుల రాష్ట్ర సదస్సు అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో శనివారం నిర్వహిస్తున్నట్లు ఆ సదస్సును రైతులు జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం వైరాలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పామాయిల్ సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నా అంతర్జాతీయ మార్కెట్‌తో ముడి పెట్టడం వల్ల పామాయిల్ గెలల ధర గణనీయంగా పడిపోయిందన్నారు. రైతులకు అందించే సబ్సిడీ సకాలంలో అందించడం లేదన్నారు. ఈ విషయాలన్నీ సదస్సులో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, మల్లెంపాటి రామారావు, వనమా చిన సత్యనారాయణ, సంక్రాంతి పురుషోత్తం, వడ్లమూడి మధు, చలపతిరావు, మల్లిఖార్జున్, వెంకటేశ్వరరావు, వీరభద్రం పాల్గొన్నారు.

తనికెళ్లలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలి

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలో టీజీ ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు ఆర్టీసీ ఆర్ఎం పవిత్రకు వినతిపత్రం అందించారు. తనికెళ్లతో చుట్టుపక్కల గ్రామాలైన అమ్మపాలెం, రాజ్యాతండా, చిన్నగోపతి, తుమ్మలపల్లి, అన్నవరం తదితర గ్రామాలకు చెందిన పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు నిత్యం తనికెళ్ల సెంటర్ నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారని వారి సౌకర్యార్థం తనికెళ్లలో ఎక్స్‌ప్రెస్ హాల్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆర్ఎం వారికి హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకుడు తేజావత్ నరసింహారావు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

ఏన్కూరు: నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో కొంతమంది వ్యాపారులు అనుమతి లేని విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు ప్రభుత్వ అనుమతి ఉన్న కంపెనీ విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, ప్రతీదానికి బిల్లులు తీసుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలు కొని ఎవరైన మోసపోతే వారికి సీపీఐ అండగా ఉంటుందన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం



దరఖాస్తులు అందజేస్తున్న లబ్ధిదారులు

సాక్షి ఎఫెక్ట్..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీలో ప్రజాపాలన సేవా కేంద్రం సేవలు శుక్రవారం అందుబాటులోకి వచ్చాయి. 'ప్రజాసేవా కేంద్రం ఏర్పాటు ఎన్నడో' శీర్షిక శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు సేవలను శుక్రవారం పునరుద్ధరించడంతో పట్టణంలోని ప్రజలు దరఖాస్తులను వెల్లువలా అందిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్: మండలంలోని సదాశివునిపాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని నారాయణపురం ఫీడర్, తుంబూరు ఫీడర్, సదాశివునిపాలెం ఫీడర్, సిద్ధారం గ్రామాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తల్లాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో..

తల్లాడ: తల్లాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని విద్యుత్ శాఖాధికారి రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కారేపల్లి మండలంలో..

కారేపల్లి: మండలంలోని కారేపల్లి క్రాస్ రోడ్డు, చీమలపాడు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈలు శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతులు దృష్ట్యా కారేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, చీమలపాడు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రైతు వేదికలు వెలవెల

- నిరుపయోగంగా మారిన కేంద్రాలు
- రైతులకు అందని సలహాలు
- అరకొర సౌకర్యాలతో అవస్థలు

రైతులకు వ్యవసాయంలో ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు వ్యవసాయశాఖలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రైతులకు ఎప్పటికప్పుడు సాగు వివరాలు, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, పంటల అమ్మకాల్లో తోడ్పాటుగా ఉంటూ అన్ని అంశాల్లో అండగా ఉండాలనే ఉద్దేశంతో రైతు వేదికలు నిర్మాణాలు చేపట్టారు. వ్యవసాయాధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించడం, సలహాలు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నారు.



వనంవారికిష్టాపురంలోని రైతు వేదిక

ముదిగొండ: ప్రభుత్వం ప్రతి ఐదువేల ఎకరాలకు ఒక క్లస్టరుగా గుర్తించి రూ.22 లక్షలతో రైతు వేదికలు నిర్మించింది. అయితే రైతు వేదికల్లో ఏఈఓలు ఈ వానాకాలంలో విత్తనాలు గురించి వివరించే ఆలోచనే లేదు. పంటలు వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదుకే పరిమితమవుతున్నారు తప్ప.. ఇతర కార్యకలాపాలు నిర్వహించడం లేదు.

తెరచుకోని రైతువేదికలు..

చాలా వరకు ముదిగొండ మండలంలో రైతు వేదికలు తాలాలు వేసి మూసి ఉంటున్నాయి. ఆన్‌లైన్‌లో పంట విత్తన పంట వివరాలు నమోదు, సమావేశాలకు మాత్రమే పరిమితమవుతున్నారు. పంటల సాగులో రైతులకు కావాల్సిన ఎరువులు, మందులు, విత్తనాలకు టోకెన్లు.. రైతు వేదికలో ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మండలంలో ఏడు వేదికలు..

ముదిగొండ మండలంలో వల్లభి, బాణాపురం, వనంవారికిష్టాపురం, పమ్మి, చిరుమర్రి, ముదిగొండ, మాదాపురం లలో రైతు వేదికలు ఉండగా.. 18,900మంది రైతులు, 50వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేపడుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

ఆయా రైతు వేదికల్లో కనీసం తాగడానికి కూడా మంచినీటి సౌకర్యాలు లేవు. చాలా చోట్ల మిషన్ భగీరథ కనెక్షన్లు బిగించారు. నేటి వరకు కనెక్షన్ ఇవ్వలేదు. రైతు వేదికల్లో ఒక స్వీపర్ కూడా లేకవడంతో దుమ్ముతో దర్శమిస్తున్నాయి. రైతులు కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవు. ఏఈఓలు తూతూ మంత్రం, చట్టపుచూపుగా వచ్చి వెళ్లిపోతున్నారు. కొన్ని రైతు వేదికలకు తాళ్లాలు తీసే దిక్కే లేదు. తీసినా ఒక గంటపాటు ఉండి ఫీల్డ్ విజిట్ పేరుతో ఉడాయిస్తున్నారు. రైతు వేదికల్లో టాయిలెట్లు లేక మహిళా ఏఈఓలు తీవ్ర ఇక్కట్లకు గురౌతున్నారు.

అప్పటి ప్రభుత్వం హడాహుడిగా రైతు వేదికలు నిర్మించి, పూర్తి సౌకర్యాలు కల్పించలేదు. అరకొర సౌకర్యాలతో చేతులు దులుపుకున్నారని రైతులు, ప్రజల వద్ద నుంచి విమర్శిమలు వినిపిస్తున్నాయి. ఇకనైనా రైతులకు ఉపయోగపడే రైతు వేదికలలో ఉదయం నుంచి, సాయంత్రం వరకు ఉండి తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని రైతులు కోరుతున్నారు.

అన్ని వేదికల్లో సౌకర్యాలు..



అన్ని రైతు వేదికల్లో సౌకర్యాలు ఉన్నప్పటికీ కొన్ని రైతు వేదికల్లో మంచినీటికి ప్రత్యేక బోర్లు వేయించారు. స్వీపర్లు, అటెండర్లు లేకపోవడంతో ఏఈఓలు సొంత ఖర్చులతో మెయింటినెన్స్ చేయిస్తున్నారు. ఏఈఓలు ప్రతిరోజు రైతు వేదికలకు వెళ్లి.. రైతులకు అందుబాటులో ఉండాల్సిందే.

– రాధ, ఏఓ, ముదిగొండ

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థులు ఎంపిక



మధిర: స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

మధిర: ఎన్ఎంఎంఎస్‌లో సీట్లు సాధించిన ఆరుగురు విద్యార్థులను శుక్రవారం పాఠశాల హెచ్ఎం మువ్వా వెంకటేశ్వరరావు, నోడల్ అధికారి వై.ప్రభాకర్ అభినందించారు. గత ఏడాది డిసెంబర్ 10న జాతీయస్థాయిలో మెరిట్ విద్యార్థుల స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలో ఎంపికైన ఎస్‌కె.సనా, ఎస్.మనో శ్రీ స్టాలిన్, పి.ప్రవళిక, ఎస్.రేణుక, డి.తారాచంద్రిక, ఎస్.శైలజలను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో చదువుతూ జాతీయస్థాయిలో నిర్వహించిన పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిగొండ పాఠశాలలో నలుగురు..

ముదిగొండ: ముదిగొండ జెడ్పీఉన్నత పాఠశాలలో చదువుతున్న రెహన్, సుశాంత్, సాహితి, సంధ్య విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికై య్యారని పాఠశాల హెచ్ఎం శాంతి తెలిపారు.



ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన తుంబూరు పాఠశాల విద్యార్థులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని తుంబూరు జెడ్పీఎస్ఎస్ పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు, కాకర్లపల్లి హైస్కూల్ నుంచి ఒక విద్యార్థి నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. జిల్లాలోనే తుంబూరు పాఠశాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికై ద్వితీయ స్థానంలో నిలిచింది. పాఠశాల హెచ్ఎం డి.దయాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సింగరాయపాలెం విద్యార్థులు..



గూడె స్వరాజ్ ఆవుల శ్రీజ

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గూడె స్వరాజ్, అవుల శ్రీజలు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ తెలిపారు. ఇందుకు గాను వారికి ఏడాదికి రూ.12,000 స్కాలర్‌షిప్ లభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం లక్ష్మీనారాయణతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ప్రారంభమైన సీపీఎం శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న రమేష్

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో సీపీఎం శిక్షణతరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు పార్టీ జెండా ఎగురవేశారు. ఈ తరగతులను పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మాచర్ల భారతి ప్రారంభించగా మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు ప్రిన్స్‌పాల్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మాదినేని రమేష్, మల్లెంపాటి వీరభద్రం, నాయకులు భాస్కర్ రావు, కృష్ణార్జున్‌రావు, అంజయ్య, కృష్ణవేణి, వెంకటి, హనుమయ్య, పుల్లయ్య, నాగేశ్వర రావు, చందర్‌రావు, బాబు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ముదిగొండ: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముదిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ లతో జాతీయ నులిపురుగుల నివారణపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు పిల్ల లందరికీ నులిపురుగు మాత్రలు ఈ నెల 20 వరకు అందించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్ వైజర్స్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్స్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

కారేపల్లి: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఎంపీపీ మాలోత్ శకుంతల పాల్గొని మాట్లాడారు. సీజనల్ వ్యాధులబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేలా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్, వైద్యాధికారి సురేష్ ,సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించారని రైతుల ఆరోపణ

కొణిజర్ల: మండలంలోని లక్ష్మీపురంలో తమ పొలాలకు వెళ్లేందుకు 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్న జన్మభూమి రోడ్డును కొందరు ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని గ్రామ రైతులు జట్ల ఆనందరావు, జట్ల సత్యం, శ్రీను, కృష్ణారావు, డాక్టర్ జట్ల రంగారావు, జట్ల ప్రసాద్, పుల్లయ్య, యల్లంకి వెంకటేశ్వరరావు, కావూరి సంపత్ తదితరులు ఆరోపించారు. ఖమ్మంకు చెందిన ఓ ఆస్పత్రి బాధ్యులు ఫెన్సింగ్ వేయగా, ఇదేమిటని అడిగితే ఇది మంత్రి భూమి ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరిస్తున్నారని వాపోయారు. ఎన్నెస్పీ కాల్వను సైతం ఆక్రమించుకుని పైప్‌లైన్ వేశారని రైతులు చెబుతున్న వీడియో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అంశంపై శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు.

రిటైర్డ్ టీచర్ రూ.10వేల వితరణ

సత్తుపల్లి: ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు భూలక్ష్మి తాను చదువుకున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన నోట్‌పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్ల కోసం రూ.10వేలతో పాటు అంగన్‌వాడీ సెంటర్‌కు రూ.1,116 అందజేశారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిత్తలూరి ప్రసాద్ అధ్యక్షతన అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మాకరాజు భూలక్ష్మి మాట్లాడుతూ ఓల్డ్ యూపీఎస్, సత్తుపల్లిలో చదువుకుని ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో సామగ్రి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న భూలక్ష్మి

కోడ్ తొలగినా.. ముసుగు తీయలే



లాలాపురంలో ముసుగు తీయకుండా ఉంచిన వైఎస్ఆర్ విగ్రహం

కొణిజర్ల: వైరా మున్సిపాలిటీ పరిధిలోని కొణిజర్ల మండలం లాలాపురంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులు ఆయన మరణానంతరం మహానాయకుడి విగ్రహం ఏర్పాటు చేసుకుని ఆరాధిస్తున్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వైరా మున్సిపల్ అధికారులు వైఎస్ఆర్ విగ్రహానికి ముసుగు వేశారు. ఎన్నికల కోడ్ ముగిసి దాదాపు పది రోజులు గడుస్తున్నా ఇంత వరకు ముసుగు తీయలేదు. దీనిపై వైఎస్ఆర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా విద్యుత్ మరమ్మతులు



మధిరలో స్తంభం సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

మధిర: మండలంలో గురువారం కురిసిన భారీ వర్షంతో కూడిన ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను, విద్యుత్ తీగలను సరిచేసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే మధిర పట్టణంలోని కొన్ని ప్రాంతాలు మినహా అన్నిచోట్ల విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఇంకా మిగిలి ఉన్న శివాలయం రోడ్డు, రామాలయం రోడ్డు, ప్రకాశం రోడ్డులోని ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు అధికంగా పోల్స్ విరిగిపోయిన సీపీఎస్ రోడ్డులో విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు విద్యుత్ శాఖ మధిర పట్టణ ఏఈ ఎస్.అనీల్ కుమార్ తెలిపారు. విద్యుత్ శాఖకు అపారంగా నష్టం వాటిల్లిన ప్రాంతాల సందర్శనకు, హుటాహుటిన పనులను పూర్తి చేసి వినియోగదారులకు సత్వరం విద్యుత్ సరఫరా అందజేసే చర్యలు చేపట్టేందుకు వరంగల్ నుంచి చీఫ్ జనరల్ మేనేజర్ కిషన్, ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్, వైరా డీఈ శ్రీకృష్ణ పర్యవేక్షణ చేస్తున్నట్లు మధిర సబ్ డివిజన్ ఏడీఈఎం అనురాధ తెలిపారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి



సత్తుపల్లిరూరల్: రేగళ్లపాడులో చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్: తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మండలంలోని రేగళ్లపాడు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.రాములు, ఎండీఓ చిన్న నాగేశ్వరరావు, రాంబాబు, కాంప్లెక్స్ హెచ్ఎం నక్కా రాజేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొప్పుల రజిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం..

కల్లూరురూరల్: మండలంలోని చంద్రుపట్ల గ్రామ పంచాయతీ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపట్టారు. మూడు సంవత్సరాల వయస్సు నిండిన పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, పద్మ, లక్ష్మీ, కృష్ణవేణి పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంపీటీసీ..

కల్లూరు: కల్లూరు శాంతినగర్‌లోని పాఠశాలను శుక్రవారం ఎంపీటీసీ కొండూరు కిరణ్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసి, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అనంతరం పాఠశాలలో టాయిలెట్లు, నీటి సౌకర్యం, ఫ్యాన్లు తదితర సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అనంతలక్ష్మి, మాజీ వార్డు సభ్యుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రత్న, మాధురి, స్కూల్ చైర్ పర్సన్ దీవెన, అంగన్‌వాడీ టీచర్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశాభివృద్ధికి పాటుపడాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని గుట్టబడి కేంద్ర ప్రాథమిక పాఠశాలలో చదివి గురుకులాల్లో సీటు సాధించిన 41 మంది బాల బాలికలను అభినందించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగబత్తిని భాస్కర్‌రావు, శ్రీనివాసచారి, గృహలక్ష్మి, బి.రవికుమార్, కె.రాంబాబు, దొడ్డా వరప్రసాద్, మాధవరావు, నాగేశ్వరరావు, సైదమ్మ, సుధాకర్, నరసింహారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రయ్య మృతిపై నివాళి..

వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు తండ్రి ఏదునూరి చంద్రయ్య శుక్రవారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చంద్రయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు వెంకటనర్సిరెడ్డి, నరసింహారావు, దానియేలు, నారాయణరావు, హరినాథ్, సౌజన్య, అశోక్, చంద్రశేఖర రెడ్డి, శ్రీను, నగేష్, రత్నం, గంగరాజు, నాగేశ్వరరావు, కృష్ణారావు తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కొణిజర్ల: తనికెళ్ల ఆఫీస్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేంసూరు/కొణిజర్ల: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి, తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.అబ్రహం అన్నారు. శుక్రవారం మండలంలోని వేంసూరు, మర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. అదే విధంగా కొణిజర్ల మండలంలోని తనికెళ్లలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఫైజుద్దీన్, వెంకటేశ్వరరావు, జగన్‌మోహన్‌రావు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16న రైతులకు శిక్షణ

మధిర: కూసుమంచి మండలం జక్కేపల్లి శ్రీ సత్యసాయి రైతు సేవా నిలయంలో ఈ నెల 16న ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు మధిర నియోజకవర్గానికి చెందిన రైతుసేవ కోఆర్డినేటర్ కుడుముల వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశవాళి వరి విత్తనాల సేకరణ కర్త విజయరామ్, సేవ్ ఆర్గనైజేషన్ హైదరాబాద్, డాక్టర్ కెవై.రామచంద్రరావు, సిద్ధార్థ యోగ నిలయం నుంచి సొల్లేటి జైపాల్ రెడ్డి, దమ్మాలపాటి సుధాకర్ రావు పాల్గొంటారని పేర్కొన్నారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహనతో పాటు ప్రజలకు సంక్రమిస్తున్న వివిధ వ్యాధులు గురించి వివరిస్తారన్నారు. అలాగే దేశవాళీ వరి ఆకుకూర విత్తనాల అవశ్యకత గురించి రైతులకు వివరిస్తారన్నారు.



ఏన్కూరు నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

హరితహారానికి సర్వం సిద్ధం

- పదో విడత మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు
- మండల టార్గెట్ 60 వేల మొక్కలు
- మండలంలోని 25 జీపీల్లో నర్సరీలు

ఏన్కూరు: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహార కార్యక్రమం చేపట్టింది. 10వ విడత హరితహార కార్యక్రమంలో భాగంగా మండలంలో అధికారులు మొక్కలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఈ ఏడాది 60 వేల మొక్కలు పంపిణీ చేయనున్నారు. 60 వేల మొక్కలను మండలంలోని 25 పంచాయతీల్లోని నర్సరీల్లో పెంచుతున్నారు.


నర్సరీల్లోని మొక్కలు..

నర్సరీలలో నీడనిచ్చే మొక్కలు, పండ్ల మొక్కలు, పూల మొక్కలు, రైతులకు జామాయిలు మొక్కలు ఇవ్వనున్నారు. మొక్కలను ఆర్అండ్‌బీ రోడ్లు, పంచాయతీ రోడ్లు పక్కను వేయనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో మొక్కలు వేయడం, రైతులు పొలం గట్ల మీద కొబ్బరి మొక్కలు, జామతోటలు, నిమ్మతోటలు వేసుకోవచ్చు. రైతులు మొక్కలు వేసేటప్పుడు గుంతలు తీసినప్పటి నుంచి 3 సంవత్సరాల వరకు మొక్క సంరక్షణకోసం ప్రభుత్వం కొంత నగదు చెల్లిస్తుంది.

రోడ్ల వెంట 10 వేలు..

మండలంలో రోడ్ల పక్కన 10 వేల మొక్కలు నాటనున్నారు. వెయ్యి మొక్కలను హరితవనం కింద కొండపై నాటేందుకు అంచనాలు సిద్ధం చేశారు. రైతులు హార్టికల్చర్ కింద కూడ మొక్కలు వేసుకోవచ్చు. ప్రభుత్వం నుంచి ఆదేశాల రాగానే.. అధికారులు మొక్కలు పంపిణీ చేయనున్నారు.

60 వేల మొక్కలు పంపిణీ..



మండలంలో 10వ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా 60 వేల మొక్కలు పంపిణీ చేసేందుకు అంచనాలు సిద్ధం చేశాం. రైతులకు పండ్ల, నీడనిచ్చే, పూల మొక్కలతో పాటు.. జామాయిల్, పొలం గట్ల మీద వేసే కొబ్బరి మొక్కలు పంపిణీ చేస్తాం.

– సకినాల రమేష్, ఎంపీడీఓ, ఏన్కూరు